- కొప్పుల ఎమ్మెల్యే కాక ముందు ధర్మపురి ఎలా ఉండేది నేడు ఎలా ఉందో పోల్చిచూడండి
- ప్రజలు ఆలోచించి ఓటు వేయండి
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

# ధర్మపురి అంతటికీ ఒకేసారి దళితబంధు



సభా వేదికపై స్థానిక ప్రజాప్రతినిధులు



ధర్మపురిలో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

జగిత్యాల, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో ధర్మపురి ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను 75వేల మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలోని దళిత కుటుంబాలన్నింటికీ ఒకేసారి దళితబంధు ఇస్తామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో ఇచ్చినమాదిరిగా ప్రతి దళిత కుటుంబానికి ఒకేసారి పథకాన్ని వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలందరికీ కొంగుబంగారమైన లక్ష్మీ నర్సింహస్వామి కొలువున్న ధర్మపురి క్షేత్రం పరమ పవిత్రమైందని, ఈ క్షేత్రానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. భూషణ వికాస శ్రీధర్మపుర నివాస అనే మకుటంతో ధర్మపురి శేషప్ప కవి రాసిన ఆధ్యాత్మిక గీతాలు అజరామమని అన్నారు. పరమ పవిత్ర గోదావరి ఉత్తర దక్షిణాలుగా సాగే చోట ఉన్న ధర్మపురిలో గతంలో గోదావరి పుష్కరాలు జరుగతాయన్న విషయమే చాలా మందికి తెలువకపోయేదన్నారు. గోదావరి పుష్కరాలు అంటే రాజమండ్రి, కృష్ణ పుష్కరాలు అంటే విజయవాడ అన్నట్లుగా ఉండేదని, తెలంగాణ ప్రజలు పుష్కరాలకు అక్కడికి పోయి గుండు కొట్టించుకొని, జేబులు ఖాళీ చేసుకొని వచ్చేవారన్నారు. 2003లో తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన పుష్కరాల సందర్భంగా ఇక్కడికి వచ్చి స్నానం చేసి ఉద్యమిస్తేనే ధర్మపురిలో గోదావరి పుష్కరాలు జరుగుతాయన్న విషయం ప్రపంచానికి తెలిసివచ్చిందన్నారు. తెలంగాణ సాధన అనంతరం 2015లో గోదావరి పుష్కరాలను ధర్మపురి క్షేత్రంలో అంగరంగ వైభవంగా జరుపుకున్న విషయం అందరికీ తెలిసిందేన్నారు. తెలంగాణ సాధన అనంతరం ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

## కొప్పులపై ప్రశంసలు

మృధు స్వభావి, సౌమ్యుడు, కార్మిక రంగం నుంచి వచ్చిన కొప్పుల ఈశ్వర్ ధర్మపురి ఎమ్మెల్యేగా పట్టుబడి ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. వాగులు బాగు చేయాలని, వంకలు మెరుగు పర్చాలని, టేల్‌ఎండ్ ప్రాంతాలకు నీళ్లు అందడం లేదంటూ కొప్పుల ఈశ్వర్ వెంటపడి నిధులు సాధించాడన్నారు. కొన్ని సందర్భాల్లో ధర్మపురి అభివృద్ధి కోసం, నిధుల కోసం, ఇక్కడి ప్రజల మంచి కోసం నన్ను వేధించాడని, అయినా ప్రజల మంచి కోసం అడుగుతున్న పనులు కాబట్టి అన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. రూ.136 కోట్లతో రోళ్లవాగు ప్రాజెక్టు, రూ.300 కోట్లతో ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథతో చెరువులను బాగు చేసుకోవడంతో పాటు, ఇక్కడ అనేక వాగులపై చెక్‌డ్యామ్‌లు కట్టుకున్న విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. ప్రభుత్వం తీసుకున్న నీటిపారుదల చర్యలతో పాటు, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, నిరంతర విద్యుత్‌తో ధర్మపురిలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ఒకప్పుడు 40వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, ఇప్పుడు 1.30లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. ధర్మపురి ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.100 కోట్లు మంజూరు చేసుకున్నామని, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిధులు సరిపోకపోతే ఇంకా అదనంగా మంజూరు చేసుకుందామన్నారు. కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలువక ముందు ధర్మపురి ఎలా ఉంది..? ఇప్పుడు ఎలా ఉందన్న విషయా న్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. ధర్మపురికి సంబంధించి అన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేస్తున్నామన్నారు. ధర్మపురి పరిధిలో అనేక రెసిడెన్షియల్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకున్న విషయాన్ని గుర్తించాలన్నారు.

## ప్రతిపక్షాలకు రైతుబంధు తెల్వదు.. రాబందులే తెలుసు..

రైతుబంధు, రైతుభీమా పథకాలను మనమే సృష్టించామన్నారు. ప్రపంచంలో ఎవరూ ఇలాంటి పథకాలను తీసుకురాలేదన్నారు. ప్రతిపక్ష పార్టీలకు రైతుబంధు తెలువదు.. రాబంధులే తెలుసు అంటూ విమర్శించారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, సకాలంలో ఎరువుల పంపిణీ, సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ సస్యశ్యామలంగా మారిపోయిందన్నారు. 3 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నదని చెప్పారు. దిగుబడి అయిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులను గోసపోసుకున్న వ్యవస్థను తీసివేసి, ధరణి పోర్టల్‌ను తీసుకువస్తే, తీసివేస్తామని ప్రతిపక్షాలు చెబుతున్నాయని, అలా జరిగితే మళ్లీ మునుపటి లెక్క లంచాల రాజ్యం వస్తుందన్నారు. తహసీల్ ఆఫీస్‌లకు వెళ్లి లంచాలు ఇచ్చే వ్యవస్థ మోపవుతుందని మండిపడ్డారు. ధరణి పోర్టల్ రద్దు అయితే రైతుబంధు, రైతుభీమా ఎలా వస్తుందని ప్రశ్నించారు. ధరణిని రద్దు చేసి, రైతుబంధు, రైతుబీమా, కొనుగోలు కేంద్రాలను ఖతం చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయన్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం మనిషికి కొన్ని డబ్బులు వసూలు చేసి, అధికారులకు లంచాలు ఇచ్చే వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు అలాంటి వ్యవస్థ ఉందా..? అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం లేదని, ఒకవేళ కాలిపోయినా ఈశ్వర్ లాంటి ఎమ్మెల్యేలు వెంటపడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టిస్తున్నారన్నారు. భారతదేశంలో అనాదిగా దళితులు ఈసడింపునకు, వెనకబాటుకు గురయ్యారన్నారు. దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉండడం సమాజానికే సిగ్గుచేటని, అందుకే దళితులు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. దళితులను గతంలో ప్రభుత్వాలు పట్టించుకుకోకపోవడం వల్లే ఆ దుస్థితి వచ్చిందన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం, తెలంగాణ ఔన త్యం కోసం ఏర్పడిందే బీఆర్ఎస్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆగమాగం కావద్దని, ఆలోచించి, వజ్రాయుధం లాంటి ఓటుతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. ధర్మపురిలో సభను చూస్తేనే తనకు ఈశ్వర్ గెలిచాడన్న విషయం అర్థం అయ్యిందన్నా రు. 'ధర్మపురిలో ఈశ్వర్ గాలి బాగా ఉందన్నారు. ధర్మపురి ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, రానున్న ఎన్నికల్లో ధర్మపురి నుంచి 75 వేల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలన్నారు. ఈశ్వర్‌ను గెలిపించిన తర్వాత, హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇచ్చినట్లుగా అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి సంతృప్తికర స్థాయిలో దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. సాయంత్రం ఐదు గంటలు దాటితే హెలికాప్టర్‌లో ప్రయాణం చేయడం ఇబ్బంది అవుతుందని, యాగంలో పాల్గొంటున్న నేపథ్యంలో హెలికాప్టర్ ప్రయాణం తప్పనిసరి అయిందన్నారు. యాగం సమయం అవుతుండడంతో తొందరగానే ప్రసంగాన్ని ముగిస్తున్నానని, ప్రజలు క్షమించాలని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. సభలో ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జడ్పీటీసీ సభ్యురాలు అరుణ, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి , బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణరావు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీలు చిట్టిబాబు, లక్ష్మి, రాజమణి, కరుణ శ్రీ, శంకరయ్య, జడ్పీటీసీలు బాధినేని రాజేందర్, సుధారాణి, రాజేందర్‌రావు, జలేంధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్లు రాజేశ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రజలు తండోపతండాలుగా సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు తరలివచ్చారు.
- మండుటెండను సైతం లెక్క చేయకుండా పిల్లాపాపలతో సభకు వద్దకు చేరుకున్నారు.
- మధ్యాహ్నం ఒంటి గంట వరకే జూనియర్ కళాశాల మైదానం పూర్తిగా నిండిపోయింది.
- కొంత ఆలస్యంగా సభకు చేరుకున్న ప్రజలకు మైదానంలో స్థలం లేక రహదారిపై నిల్చుండిపోయారు. దీంతో కొంత ట్రాఫిక్ అంతరాయం కలిగింది.
- ఏడు మండలాల నుంచి దాదాపు 70 వేల మంది తరలివచ్చారు.
- ఎండ తీవ్రతకు తట్టుకోలేక కటౌట్ల కింద మహిళలు కూర్చుండి కేసీఆర్ స్పీచ్‌ను ఆసక్తిగా విన్నారు.
- సాయంత్రం 4.38గంటలకు హెలికాప్టర్ హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నది.
- హెలిప్యాడ్ వద్ద నుంచి సాయంత్రం 04.40గంటలకు సభాస్థలికి సీఎం కేసీఆర్ చేరుకున్నారు.
- 04.41 గంటల నుంచి 4.44 గంటల దాకా మంత్రి ఈశ్వర్ మాట్లాడారు.
- 04.44గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించడం, యువకులు కేరింతలు కొట్టగానే ఈశ్వర్ గాలి బాగానే ఉన్నదని అర్థమైందని సీఎం కేసీఆర్ అన్నారు.
- 04.45 గంటల నుంచి కేసీఆర్ ప్రసంగించారు.
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రమై ధర్మపురి భూమికి శిరస్సు వంచి నమస్కరిస్తూ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు.
- మొదట శేషప్ప కవి రచించిన 'భూషణ వికాస శ్రీ ధర్మపురి నివాస, దుష్ట సంహార నరసింహ దురితదూర' అనే పద్యాన్ని చదడవడంతో ధర్మపుర ప్రజలు పులకించిపోయారు.
- సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో తెలంగాణ యాసలో పలికిన ప్రతి సామెతకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.
- 'సాయి సంసారి.. లచ్చిదొంగ, కొత్తకుండలో ఈగ సొచ్చింది. కొత్త సంసారం.. సాగు నీళ్లు లేవు.. తాగునీళ్లు లేవు..' అంటూ సాధారణ వ్యక్తుల పరిభాషలో మాట్లాడం అందరినీ అలరించింది
- 'కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే పంటికి అంటకుండా మింగుదామని చూస్తున్నారు.. ఆగమాగం కావద్దు. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లయితది' అంటూ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యేలా సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో వివరించడంతో గ్రామీణులు కేరింతలు కొట్టారు.
- అభ్యర్థుల గుణం.. గణం.. చరిత్రతో పాటు, వాళ్లను నిలబెట్టిన పార్టీ దృక్పథాన్ని సైతం చూడాలని సీఎం కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
- ఓటు ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న వజ్రాయుధం.. దాన్ని సరిగా వినియోగించాలి.. లేకుంటే ఐదేండ్లు నష్టపోతారు అన్న మాటలు ప్రజల్లో ఆలోచనను కలిగించాయి.
- 'ఈ బ్యాంకు.. ఆ బ్యాంకు.. అంజుమన్ బ్యాంకు.. కోఆపరేటివ్ బ్యాంకులన్నీ రైతుల రుణాల కింద ఇండ్ల తలుపులకాడికెల్లి గుంజుకువెళ్లాయి అన్న' సీఎం మాటలు ప్రజల్లో గత కష్టాలను గుర్తుకు తెచ్చాయి.
- 'రైతుబంధు అందరికీ వస్తుంది.. టింగ్‌టింగ్ మంటూ మీ సెల్‌ఫోన్లకు మెసేజ్ వస్తుందా..? లేదా అని' సీఎం కేసీఆర్ సభికులను ప్రశ్నించగా, వస్తుందని ప్రజలు సమాధానం చెప్పారు.
- 'ధర్మపురి గుడికి వందకోట్లు ఇచ్చాం.. ఇంకా అవసరమైతే ఇద్దాం'.. అనగానే ప్రజలు ఆనందపడ్డారు.
- 'సభను చూస్తేనే తెలిసిపోయింది.. ఈశ్వర్ గెలిచిండని..' అని సీఎం కేసీఆర్ అనగానే సభలో ప్రజలు హర్షధ్వనులు చేశారు.
- 'ఈశ్వర్‌ను 75వేల మెజార్టీతో గెలిపించండి.. . హుజురాబాద్ లెక్క ధర్మపురిలో దళితబంధు అందరికీ ఒకేసారి ఇస్తాం' ప్రకటించగానే 'సీఎం కేసీఆర్ జిందాబాద్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ప్రజలు హర్షధ్వనులు చేశారు.
- హెలిక్యాప్టర్ ఉంటే ఇదే తిప్పలు.. ఐదు అయిందంటే చాలు.. పోదాం అంటరూ.. ప్రజలు క్షమించాలని సీఎం కేసీఆర్ చెప్పగా, ప్రజలు అంగీకరించారు.
- 'యాగం ఉందని, అందరికీ మంచి జరుగుతుందంటూ' సీఎం కేసీఆర్ సభకు నమస్కారం చేసి సభను ముగించారు.

- ధర్మపురి రూరల్/వెల్గటూర్/జగిత్యాల అర్బన్

నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

BUSINESS OFFER

★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324-All

CHANGE OF NAME

★ I, NADIMETLA ANITHA, W/o. Pothu Ravi, R/o. H.No. 4-99, Thakkallapalli, Mallial, Jagtial-505 452, T.S. Changed My Name as "Pothu Mamatha".
NT-320767

★ I, KONDAM KARNAKAR REDDY, S/o. Laxma Reddy , R/o. H.No. 3-2-33/2/1, Vasavi Nagar, Sircilla, TS, have Changed My Name as KONDAM KAMALAKAR REDDY, S/o. Laxma Reddy.
NT-320770

★ I, KONDAM PADMA, W/o. Kondam Kamalakar Reddy, R/o. H.No. 3-2-33/2/1, Vadavi Nagar, Sircilla, TS, have Changed My Name as NARRALLO PADMAJA, W/o. Kondam Kamalakar Reddy.
NT-320770

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194